క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కాటారం: మండలంలోని ధన్వాడ, దామెర కుంట సబ్‌స్టేషన్ మెయింటెన్స్ పనుల నిమిత్తం నేడు(శనివారం) సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈఈ మేఘనాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు ఆయా గ్రామాలకు విద్యుత్ నిలిపివేయడం జరుగుతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

మండల అధ్యక్షుడిగా రవితేజ



కాళేశ్వరం: మాదిగ యువసేన మహదేవపూర్ మండల అధ్యక్షుడిగా మంథని రవితేజను నియమించినట్లు రాష్ట్ర ఎమ్మెస్పీ నాయకుడు మంద కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన నాయకులకు రవితేజ కృతజ్ఞతలు తెలిపారు.

పోగొట్టుకున్న నగదు అందజేత



రేగొండ: రేగొండ మండలంలోని తిరుమలగిరి శివారు బుగులోని శ్రీ వేంకటేశ్వరస్వామి జాతరలో చంద్రకళ అనే మహిళ శుక్రవారం రూ.5,000ల నగదు ఉన్న పర్సును పోగొట్టుకుంది. కాగా, జాతరలో విధులు నిర్వర్తిస్తున్న రేగొండ మహిళా కానిస్టేబుల్ కవిత చాకచక్యంగా వ్యవహరించి శివాలయ ప్రాంగణంలో పర్సును స్వాధీన పర్చుకుని బాధిత మహిళకు అందించారు. దీంతో సీఐ మల్లేష్‌యాదవ్, ఎస్సై సందీప్‌కుమార్ మహిళా కానిస్టేబుల్ కవితను అభినందించారు.

రైతులను మోసం చేస్తే కేసులు

చిట్యాల: పత్తి, ధ్యాన్యాన్ని కొనుగోలు చేసేటప్పుడు తూకంలో మోసం చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని సీఐ మల్లేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల మండలంలోని గోపాలపూర్ గ్రామంలో సంబంధిత అధికారుల నుండి ఎటువంటి పర్మిషన్ లేకుండా పత్తి కొనుగోలు చేస్తు క్వింటాకు 10కిలోలు తక్కువ వచ్చే విధంగా కంప్యూటర్ యంత్రాన్ని ఉపయోగిస్తూ పట్టుబడిన తూర్పాటి అశోక్‌పై చీటింగ్ కేసు నమోదు చేయడం జరిగిందని పేర్కొన్నారు. రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు, పత్తి సీసీఐ కేంద్రాలల్లోనే అమ్ముకోవాలని సూచించారు.

పరామర్శ



కాటారం: మండల కేంద్రంలో అనారోగ్యంతో బాధపడుతున్న పలువురిని మాజీ ఎంపీటీసీ తోట జనార్దన్ శుక్రవారం పరామర్శించారు. రోడ్డు ప్రమాదానికి గురైన కొండగొర్ల సమ్మయ్య, అనారోగ్యంతో బాధపడుతున్న గంట దేవదాస్, గొని అశోక్‌ను జనార్దన్ పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట మాజీ వార్డు సభ్యులు గంట శ్రావణ్, తైనేని సతీశ్, నాయకులు మానెం రాజబాబు, మాచర్ల రాజనారాయణ, సుశాంత్, మల్లేశ్, రాజేందర్ ఉన్నారు.

'దేవస్థాన అధికారుల తీరుమారడం లేదు'

కాళేశ్వరం: కాళేశ్వరం దేవస్థానం అధికారుల తీరు మారడం లేదని, ప్రతీ ఒక్క భక్తుడికి ఆలయంలో మర్యాద ఇవ్వాల్సిన అధికారులు కొంత మందికి మాత్రమే అందలం ఎక్కిస్తున్నారని కాళేశ్వరం మాజీ సర్పంచ్ మెంగాని మాధవి అన్నారు. శుక్రవారం జ్వాలతోరణం కార్యక్రమం నిర్వహిస్తున్న సందర్భంగా అధికారులు, సిబ్బంది తమ వారికి అవకాశం కల్పిస్తు, ఇతర భక్తులను పట్టించుకోలేదని అన్నారు. మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి ఈవిషయాన్ని తీసుకువెళ్తానని తెలిపారు.

'ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలి'

చిట్యాల: ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని ధర్మసమాజ్ పార్టీ మండల అధ్యక్షుడు పర్లపెల్లి కుమార్ అన్నారు. మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ ఫలాలు ఏకపక్షంగా కొన్ని కులాలు చేజిక్కించుకున్నాయని అన్నారు. ఎస్సీ వర్గీకరణకు సుప్రీం కోర్టు తీర్పు వచ్చిన నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి అసెంబ్లీ సాక్షిగా వర్గీకరణ చట్టాన్ని వెంటనే చేస్తానని చెప్పి మాటను తుంగలో తొక్కారని అన్నారు. ఇటీవల డీఎస్సీ నియామకాల్లో గ్రూప్ వన్ నోటిఫికేషన్‌ల్లో అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. దళిత కులాల మధ్య అసమానతలు తొలగాలంటే వర్గీకరణ పక్కాగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

టేకుమట్ల: వెలిశాల శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు



చిట్యాల: పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు



భూపాలపల్లి అర్బన్: శివాలయంలో బారులుదీరిన భక్తులు



ఘనంగా కార్తీక పౌర్ణమి వేడుకలు

టేకుమట్ల: మండల కేంద్రంతో పాటు, మండలంలోని అన్ని గ్రామాల్లో కార్తీక పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం చలివాగు మానేరుల్లో గంగస్నానమాచరించారు. అలాగే ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి, సాయంత్రం ఇంటి ముంగిళ్లలో దీపాలను వెలిగించారు.

సామూహిక సత్యనారాయణవ్రతాలు

మండలంలోని గర్మిళ్లపల్లి శ్రీరామాలయంలో శుక్రవారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాన్ని ఆలయ చైర్మన్ సలిగంటి సంపత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు సునీల్‌శర్మ ప్రత్యేక పూజలను నిర్వహించారు. అలాగే సాయంత్రం కార్తీక పౌర్ణమి వేడుకల్లో భాగంగా దీపారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు.

భూపాలపల్లి అర్బన్: కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని జిల్లావాసులు శుక్రవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. తెల్లవారుజామునే ఆలయాలకు చేరుకుని కార్తీక దీపాలు వెలిగించారు. ఈ సందర్భంగా పలు చోట్ల భక్తుల రద్దీ కనిపించాయి. సాయంత్రం ఇళ్ల వద్ద మహిళలు దీపాలు వెలిగించడంతో కాలనీలు శోభాయమానంగా కనిపించాయి.

రేగొండ: కార్తీక పౌర్ణమి సందర్భంగా రేగొండ, కొత్తపల్లిగోరి మండలాలలోని శివాలయాలు భక్తులతో పోటెత్తాయి. శివనామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. కొత్తపల్లిగోరి మండల కేంద్రంలోని శివాలయంలో భక్తులు ఉదయం నుంచే పోటేత్తారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రేగొండ మండలంలోని కొడవటంచలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజామునే పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు బారులుదీరారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా కోటంచ ఆలయంలో భక్తులు సత్యనారాయణవ్రతం చేశారు.

చిట్యాల: మండలంలోని నైన్‌పాక గ్రామంలో నవగ్రహాల ఆలయ ప్రాంగణంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా శ్రీ రామకృష్ణ పరమహంస ట్రస్ట్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో తులసి దామోదర కల్యాణ మహోత్సవ సాముహిక సత్యనారాయణవ్రతం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సమావేశంలో ఆలయ ట్రస్ట్ సభ్యులు, మహిళలు, నాయకులు పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి: మండలంలోని పిడిసిల్ల, మొగుళ్లపల్లి, పర్లపల్లితో పాటు పలు గ్రామాల్లోని శివాలయాల్లో కార్తీక పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భక్తులు ఉసిరిపత్రాలు, కాయలతో పుణ్యస్నానాలు ఆచరించి మారేడు పత్రాలు, నెయ్యితో వత్తులను వెలగించి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



రేగొండ: సత్యనారాయణ వ్రతంలో పాల్గొన్న భక్తులు



రేగొండ: పూజలు చేస్తున్న భక్తులు



మొగుళ్లపల్లిలో..



కాళేశ్వరం: గోదావరిలో దీపాలు వదులుతున్న మహిళలు



టేకుమట్ల: హనుమాన్ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



కాళేశ్వరం: స్వామివారి గర్భగుడిలో పూజలు చేస్తున్న భక్తులు

మూడు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపిక

- పోలీస్ ఉద్యోగం చేస్తూనే మరో రెండు కొలువులు సాధించిన యువకుడు

గణపురం: మనిషి తలుచుకుంటే సాధించలేనిది లేదని నిరూపించిన ఒక యువకుడు ఏకంగా మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాడు. ఒక వైపు పోలీస్ కొలువు చేస్తూనే దొరికిన కొద్ది పాటి సమయాన్ని వృథా చేయకుండా ఉన్నత కొలువుల కోసం కష్టపడి చదివాడు. వివరాల్లోకి వెళితే.. గణపురం మండలం మైలారం గ్రామానికి చెందిన గుగులోత్ వినోద, దేవుల నాయక్ చిన్న కుమారుడు సుమన్ నాయక్ 2013లో ఎస్‌పీఎఫ్ కానిస్టేబుల్‌గా ఎంపికై వరంగల్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో సంవత్సరం సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. మళ్లీ గురువారం వెలువడిన గ్రూప్ ఫోర్ ఫలితాలలో సత్తా చాటి రెవెన్యూ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సాధించాడు. 11 సంవత్సరాలుగా ఉద్యోగం చేస్తూనే ఉన్నత ఉద్యోగం కోసం తీవ్రంగా కృషి చేశాడు. ఇటీవల జరిగిన గ్రూప్ వన్ మెయిన్స్ పరీక్షలను కూడా రాసి ఫలితాల కోసం ఎదురు చూస్తున్నాడు. ఈ విజయాన్ని తన తల్లికి అంకితం ఇస్తున్నట్లు సుమన్ నాయక్ తెలిపారు. ఏకంగా మూడు ఉద్యోగాలు సాధించిన సుమన్‌ను గ్రామస్తులు, బంధువులు, స్నేహితులు అభినందిస్తున్నారు.

సమగ్ర సర్వే పరిశీలన



సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ జవహర్‌రెడ్డి

గోవిందరావుపేట: మండల పరిధిలోని చల్వాయి గౌరారం గడ్డలో గ్రామ కార్యదర్శి చుంచు భారతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుల గణన సర్వేను శుక్రవారం ఎంపీడీఓ జవహర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. సామాజిక వర్గాల వారీగా కులగణన చేసి సంక్షేమ పథకాలు అమలు చేసేందుకు ప్రభుత్వం కుల గణన సర్వే ప్రారంభించిందని అన్నారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని, ప్రజలు సిబ్బందికి సహకరించాలని తెలిపారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు.

సర్వేకు సహకరించాలి

వాజేడు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుటుంబ సమగ్ర సర్వేకు ప్రజలు సహకరించాలని ఎంపీఓ శ్రీకాంత్ నాయుడు కోరారు. మండలంలో నిర్వహిస్తున్న సర్వేను శుక్రవారం ఎంపీఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్యుమరేటర్లకు పలు సూచనలు చేశారు.

ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేయాలి

మల్హర్: కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని యుద్ధ ప్రాతిపాదికన తక్షణమే కొనుగోలు చేయాలని ప్రజా సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని కొయ్యూరులోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వారు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల నాయకుడు పీక కిరణ్ మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాలను పేరుకు మాత్రమే ప్రారంభించారని అన్నారు. తేమా, తాలు తదితర కారణాలతో నెలలు గడుస్తున్నా ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం సన్న రకం ధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పిదని కాని రకాల ధాన్యానికి బోనస్ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు అక్కల బాపు. పోచయ్య. సత్యనారాయణ, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న నాయకులు

రక్తదానం ప్రాణదానంతో సమానం

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

టేకుమట్ల: రక్తదానం ప్రాణదానంతో సమానమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఎమ్మెల్యే జన్మదినం సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్‌గౌడ్ ఆధ్వర్యంలో రక్తదానం శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గండ్ర ముఖ్య అతిథిగా హాజరై రక్తదానం చేసిన 100మందికి సర్టిఫికెట్లు అందజేశారు.

భూపాలపల్లి అర్బన్: ఎమ్మెల్యే సత్యనారాయణరావు జన్మదిన వేడుకలను నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. కాంగ్రెస్, ఐఎన్‌టీయూసీల ఆధ్వర్యంలో వేర్వురుగా వేడుకలు నిర్వహించారు.

చిట్యాల: మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం సివిల్ ఆసుపత్రిలో పండ్లు పంపిణీ చేశారు.

రేగొండ: మండలంలోని కొడవటంచలో ఎస్ఎస్ఆర్ సంస్థల అధినేత నాయినేని సంపత్‌రావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయనను గజమాలతో సన్మానించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో పీపీసీ అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, ఆలయ చైర్మన్ భిక్షపతి ఉన్నారు.



టేకుమట్ల: సతీష్‌గౌడ్‌కు సర్టిఫికెట్ అందిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

యాదవ సంఘం కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులు

కాటారం: అఖిల భారత యాదవ సంఘం గంగారం గ్రామ నూతన కమిటీని శుక్రవారం హడక్ కమిటీ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా జిల్లాల ఓదన్న, అధ్యక్షుడిగా బండి రాజేందర్, ఉపాధ్యక్షుడిగా జిల్లాల దేవేందర్, ప్రధాన కార్యదర్శిగా కొట్టెకోల్లా శ్రీశైలం, కోశాధికారిగా అయిలయ్య, సహకార్యదర్శిగా గౌరయ్య ఎన్నికయ్యారు. నూతన కమిటీకి హడక్ కమిటీ సభ్యులు ఎన్నిక పత్రాన్ని అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ హడక్ కమిటీ సభ్యులు గడ్డం చంద్రయ్యయాదవ్, మొగిలి రాజ్‌కుమార్, అబ్బినవేన ఐలయ్యయాదవ్, గడవేన దేవేందర్‌యాదవ్, అత్మకూరి కుమార్‌యాదవ్, తొట్ల శ్రీశైలం యాదవ్ పాల్గొన్నారు.

'పేదలకు అండగా కాంగ్రెస్'

గోవిందరావుపేట: పేదలకు అండగా కాంగ్రెస్ ఉంటుందని పార్టీ మండల అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ అన్నారు. మండల పరిధిలోని రాఘవపట్నం గ్రామానికి చెందిన అనాథ వృద్ధురాలు సగులూరి వెంకటమ్మ ఇంటి గోడలు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కూలిపోయాయి. దీంతో ప్రభుత్వం తక్షణ సాయం కింద రూ.16 వేలను అందించగా రేకులు వేయించి ఆశ్రమం కల్పించారు. కాగా, పాలడుగు వెంకటకృష్ణ ఆధ్వర్యంలో బాగు చేయించిన ఇంటిలోకి శుక్రవారం పంపించారు.

మల్చింగ్ సాగుపై మొగ్గు





మల్చింగ్‌తో సాగు చేస్తున్న మిర్చి పంట

- మిర్చిసాగులో వినియోగిస్తున్న రైతులు
- ఖర్చు ఆదాతో పాటు, అధిక దిగుబడి

మొగుళ్లపల్లి: వ్యవసాయానికి రోజురోజుకూ ఖర్చులు పెరుగుతుండడంతో రైతులకు నష్టాలే మిగులుతున్నాయి. కూలీల కొరతతో పాటు, పంటల దిగుబడులు తగ్గి కనీసం పెట్టుబడి రాని పరిస్థితి. ఈ నేపథ్యంలో సంప్రదాయ పద్ధతులకు భిన్నంగా ఆధునిక పద్ధతుల వైపు రైతులు అడుగులు వేస్తున్నారు. సాగుబడిలో నూతన ఒరవడి వైపు అడుగులు వేస్తూ మండలంలోని రంగాపురం గ్రామంలో మిర్చి సాగులో రైతులు మల్చింగ్ బాటపట్టారు. గత ఏడాదిలో పోలిస్తే 80 శాతానికి పైగా మిర్చి తోటలలో మల్చింగ్ షీట్‌లే దర్శనమిస్తున్నాయి.

ఖర్చు ఆదా...

మల్చింగ్ షీట్‌లతో రైతులకు బహుళ ప్రయోజనం కలుగనుంది. సాధారణ పద్ధతుల్లో మిర్చి సాగు చేయాలంటే చాలా రకాల ఖర్చులుంటాయి. అందుకు భిన్నంగా మల్చింగ్ షీట్‌తో పాటు దానికి అనుసంధానంగా ఉన్న డ్రిప్ (బిందుసేద్యం)తో రైతులు ఆధునీకత వైపు అడుగులు వేస్తున్నారు. ఈ సాగు ద్వారా వ్యయ భారాన్ని తగ్గించడంతో పాటు 80 శాతం ఎరువులు, పురుగు మందుల వినియోగం ఆదా అవుతోంది. మల్చింగ్ షీట్ పైభాగం తెలుపుగా ఉండడం అడుగు భాగం నలుపుగా ఉండడంతో పంటకు చీడ, పీడలు దరిచేరవని వ్యవసాయ అధికారులు తెలుపుతున్నారు. అదే విధంగా డ్రిప్‌ల వినియోగంతో నీటి వృథా, పురుగు మందులు, ఎరువుల వాడకం తగ్గుతుండడం ప్రధాన కారణం.

డ్రిప్, మల్చింగ్‌షీట్ ఏర్పాటు ఇలా..

మొదట పొలాన్ని దుక్కిచేసి బోదెలు కొడతారు. తర్వాత డ్రిప్‌కు సంబంధించిన పైపులను బోదెలపై అమరుస్తారు. ఆ తర్వాత ప్లాస్టిక్ కవర్లు(మల్చింగ్ షీట్) బోదెలపై వేసి మొక్కలు వేసే చోట రంధ్రాలు చేస్తారు. దీని వల్ల మొక్కకు డ్రిప్ ద్వారా నేరుగా నీరు అందుతుంది. మల్చింగ్ షీట్‌లు ఉండడంతో భూమిలోని నీటి తేమ సైతం ఆరకుండా ఉంటుంది. సాధారణ పద్ధతుల్లో ఎకరాలకు సరిపోయే నీళ్లు మల్చింగ్‌తో 3 ఎకరాలకు సరిపోతాయి. అంతేకాక మల్చింగ్ వల్ల కలుపు మొక్కలు పెరుగకపోవడంతో కలుపు బాధ కూలీల కొరత ఉండదు. పంట చేతికి వచ్చే సమయంలో మిర్చి రాలిన కాయలు కుళ్లిపోవు. మండలంలో 2600 ఎకరాల మిర్చి పంట సాగవుతుండగా సుమారు 1000 ఎకరాలకు పైగా మల్చింగ్‌తోనే సాగవుతోంది.

అందని సబ్సిడీ

ఎకరాకు 500 మీటర్ల నుంచి 600 మీటర్లు 0.5 ఎంఎం మల్చింగ్ షీట్ అవసరం ఉండగా ధర రూ.20వేల వరకు అవుతుంది. ఒక ఎకరాకు డ్రిప్ (బిందుసేద్యం) ఏర్పాటుకు గానూ పైపులకు రూ.50వేల వరకు మార్కెట్‌లో దొరుకుతాయి. కానీ హార్టికల్చర్ శాఖ ద్వారా డ్రిప్‌లు ఎస్సీ, ఎస్టీలకు 100 శాతం బీసీలకు 75 శాతం, ఓసీలకు 50 శాతం సబ్సిడీపై గతంలో అందజేసేవారు. కానీ ఇప్పుడు అందజేయడం లేదని రైతులు తెలుపుతున్నారు.

సబ్సిడీ అందజేయాలి



మిర్చి పంట సాగులో మల్చింగ్ షీట్ దానికి అనుసంధానంగా డ్రిప్‌తో రెండు నెలల పంట కాలం పెరిగింది. శీతాకాలంలో వేరు వ్యవస్థ వృద్ధిచెంది నాణ్యమైన దిగుబడులు వస్తున్నాయి. కానీ ప్రభుత్వం హార్టికల్చర్ శాఖ ద్వారా డ్రిప్‌లకు, మల్చింగ్‌కు సబ్సిడీ అందజేయాలి.

- అచ్చ బుచ్చరావు, రైతు, రంగాపురం

వ్యయభారం తగ్గింది



నూతన పద్ధతిలో మిర్చి సాగు చేయడంతో వ్యయభారం తగ్గింది. సాధారణ పద్ధతి సాగుతో పోలిస్తే ఈ పద్ధతి బాగుంది. రోజుకు పదుల సంఖ్యలో కూలీలను వినియోగించాల్సి ఉండగా మల్చింగ్ సాగుతో ఇద్దరు కూలీలు పది ఎకరాల్లో పనిచేయవచ్చు. మూడేళ్లుగా మల్చింగ్ విధానంతో అధిక దిగుబడులు సాధిస్తున్నాం.

- రాజయ్య, రైతు, రంగాపురం

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



ఏటూరునాగారం: మండల కేంద్రానికి చెందిన గుర్రం కనకయ్య అనారోగ్యంతో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొంది ఇటీవల మృతి చెందాడు. కాగా బాధిత కుటుంబ సభ్యులు ఆర్థిక సాయం కోసం సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోగా రూ.60వేల చెక్కు మంజూరైంది. దీంతో చెక్కును శుక్రవారం బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు గడదాసు సునీల్‌కుమార్ లబ్ధిదారులకు అందజేశారు. జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు, బడే నాగజ్యోతి, గోవింద్‌నాయకులకృషితో చెక్కు మంజూరు అయ్యిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అంతటి విజయ నాగరాజు, షఫీ, నర్సయ్య, చిన్ని కృష్ణ, రాంబాబు, బోజారావు పాల్గొన్నారు.